# ★ పరాజితుడు ★

రచన:
సి. హెచ్. లలితకుమారి

అమావాస్యనాటిరాత్రి. కన్నుపొడుచుకున్నా కనుపించని గాఢాంధకారము. కాళరాత్రి విలయనృత్యంచేస్తోంది. అక్కడక్కడ కీచురాళ్ళధ్వని, సెలయేటిగలగలలు తప్ప మరేశబ్దమూ వినబడుటలేదు. అంతటా భయంకర నిశ్శబ్దత ఆవరించివున్నది. ఆచీకటిలో రోడ్డుప్రక్కనున్న పెద్ద వృక్షాలు జుట్టు విరబోసికొన్న దెయ్యాలవలె భయంగొల్పుతున్నాయి. పొలాల్లో కాపలా కాసేవాళ్ళు చలికి వేసుకున్న మంటలు కొరివి దెయ్యాలవలె భయంకరంగా ఆగి ఆగి కనిపిస్తున్నాయి. దూరాన గడియారం పన్నెండు గంటలు కొట్టింది. ఆచీకటిలో ఒక వ్యక్తి తలనిండా ముసుగు కప్పుకొని చాల ఆత్రుతగా భయం భయంగా రైలు స్టేషన్‌వేపు పరుగెడుతున్నాడు అప్పుడే రైలు ఆదెయ్యాల అలుపుకుమల్లే భీకరంగా అరచుకుంటూ పొగలు గ్రక్కుకుంటూ బయలుదేరబోతోంది. గబగబావచ్చి ఆవ్యక్తి చటుక్కున పెట్టెలోకి రొప్పుకుంటూ ఒక్కఉదుటన యెక్కాడు. కాస్సేపటికి ఆవ్యక్తి పెట్టంతా కలయజూచాడు. అది చాలా చిన్న పెట్టె. ఎదురుసీటుమీద ఎవరో ఒక ముసలాయన. ఆప్రక్కనే ఒక యువదంపతులు. తరువాత సీటుమీద ఎవరో యిద్దరు కాలేజీ విద్యార్థులు. ఇంకోబల్లమీద ఇద్దరు ఆధునిక యువతులు కూర్చొన్నారు. ఆ విద్యార్థులు ఎట్లాగైనా వారిని పలకరించాలని మహా తాపత్రయపడుతున్నారు. ఆప్రక్కనే యింకెవరో నడివయస్కులు రాజకీయాలమీద హోరాహోరీగా వాదించుకుంటున్నారు. ఇద్దరు ముసలివాళ్ళు యీకాలపు ఆడపిల్లలమీద దాడిచేస్తున్నారు. ఆడపిల్లలు కాలేజిలో చేరడం మూలంగానే మగ పిల్లలు పాడైపోతున్నారుట. వాళ్ళు చదవటంమూలంగానే దేశం యింత హీనస్థితికి వచ్చిందట "అయినా పొయ్యి దగ్గరవుండే వాళ్ళకు యీ చదువులు ఎందుకంట. బి. ఏ. చదివినా బియ్యం కడగటం తప్పదుగదా? అట్లాంటప్పుడు వీళ్ళకి చదువులు ఎందుకంట?" ఈవిధంగా సాగిపోతోంది వాళ్ళ సంభాషణ కాని ఆవ్యక్తి యివేమీ గమనించేస్థితిలో లేడు. తన గమ్యం ఎక్కడికి? టిక్కెట్టు కలెక్టరువస్తే ఏమనిసమాధానం చెప్పాలి? పాపం శేఖర్ తెల్లారిలేచి తను లేకపోతే ఎంత విలపించుతాడు. అతను గుర్తుకు వచ్చేటప్పటికి కళ్ళనుండి నీళ్ళు కారటం మొదలుపెట్టాయి. అతను రైలు కిటికీగుండా బాహ్యంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని మనస్సులోని ఆలోచనలు రైలు వేగంతో పోటీచేస్తున్నాయి. "మిస్టర్ టిక్కెట్ ప్లీజ్" అంటూ గంభీరమైన కంఠం వినిపించింది వెంటనే ఆవ్యక్తి గుండెల్లో రాయి పడింది. అతనికి ముచ్చెమటలు పోశాయి. ముందు వినిపించుకోనట్లు నటించాడు కాని టిక్కట్ కలెక్టరు వదలక భుజంతట్టి "మిస్టర్ నిన్నే అడిగేది" అని గట్టిగా అరిచాడు. అతను మెల్లిగా, మొహం అటువేపుకి తిప్పాడు వెంటనే టిక్కట్ కలెక్టరు 'హల్లో శంకర్ నువ్వా? How are you? ఏమిటిలా బయలు దేరావు? ఎక్కడిదాకా? ప్రస్తుతం నీవేమిచేస్తున్నావు? ఏమిటీ సంగతి అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. 'నువ్వా మధు! ఎన్నాళ్ళకు కలుసుకున్నాం' నేనిప్పుడు యమ్. ఏ. ఫైనలియియర్. ఎక్కడకు బయలుదేరానంటావా.... ఈ రైలు చివరకు ఎక్కడ ఆగితే అక్కడకు. అర్ధరాత్రి ఇంటినుండి పరిగెత్తుకువచ్చి టిక్కట్టు లేకుండా ప్రయాణంచేసేవాళ్ళకు ఒక గమ్యం అంటూ వుంటుందా? అసలు నాజీవితానికే గమ్యంలేదు. గాడి తప్పిన జీవితానికి గమ్యం ఏమిటీ అని అన్నాడు. ఈమాటలు వింటూంటే మధుకి ఆశ్చర్యం కలిగింది. ఏమిటి శంకర్ యిట్లా ఎందుకు బయలుదేరినట్లు? చదువుకుంటున్నవాడు మధ్యలో ఆపేసి యిట్లా పారిపోవటానికి కారణమేమిటి? తను, శంకర్ విడిపోయి 7, 8 సంవత్సరాలవుతోంది. ఫోర్తుఫారమ్ వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఆరోజులలో వాళ్ళిద్దరూ ఎంతస్నేహంగా వుండేవారు! ఒక్కళ్ళనివిడచి ఒకళ్ళువుండగలమా అని అనిపించేది. రోజులెంతలో గడచిపోయాయి? ఏమిటో పిచ్చికాని ఇప్పుడు విడిపోయి వుండటంలేదూ? అంతా ఒట్టి భ్రమ. మనుష్యులు మారినా, వారి తత్వాలుమారినా యిట్లాంటి సంయోగ వియోగాలు ఎన్ని సంభవించినా ఆ కాలచక్రం అల్లా నిరంతరం తిరుగుతూనే వుంటుంది, అది దేన్నీ లక్ష్యపెట్టదు. అప్పుడే ఆచక్రంలో ఎనిమిది ఆకులు తిరిగిపోయాయి ఆ తరువాత మళ్ళీ తను శంకర్‌ని కలుసుకోలేదు. అన్ని యేళ్ళకు కలుసుకున్నాం. అసలు జీవితంలో మళ్ళీ కలుసుకోగలనా అని అనుకునేవాడిని. ఎట్లాగైనాసరే శంకర్ గురించి తెలుసుకోవాలి" అని కుతూహలంతో శంకర్‌ని "సంగతి ఏమిటి" అని అడిగాడు మధు. వ్యథతోనిండిన మనస్సుతో తన బాధ ఎవరికైనా చెప్పుకుంటే కొంతభారం తగ్గుతుందని శంకర్ తన కథ యిట్లా చెప్పడం మొదలు పెట్టాడు.

* * *

మధూ! మనం కలలోకూడా అనుకోని సంఘటనలు, ఊహాతీతమైన పరిణామాలు మన నిత్యజీవితంలో తటస్థపడుతాయి. మనం పరిస్థితులకులోనయి వాటిని యెదుర్కొనక తప్పదు. మనం వాటినుండి దూరంగా పారిపోవడానికి ప్రయత్నిస్తాం. మనం దేన్నయితే గాఢంగా ప్రేమించి ప్రాణానికి ప్రాణంగా భావించుతామో దాన్నే కొన్ని సమయాలలో అసహ్యించుకోవలసి వస్తుంది. ఆ ప్రేమ స్థానంలో మనం శత్రుత్వం, ద్వేషం నింపుకోవలసి వుంటుంది. కాని చివరకు గెలిచేది ప్రేమ. నాకు అటువంటి పరిస్థితులే యేర్పడ్డాయి.

అప్పటికి నాకు ఆరేళ్ళు వుంటాయేమో. నాకంతా లీలగా గుర్తుంది. అమ్మా నాన్న

యేమిటో చాలా హడావుడిగా సామాను అవీ సర్దుతున్నారు. నాకేమిటో అర్థం కాలేదు. ఇంతల్లోకి గుర్రిబ్బండి వాకిట్లోకి వచ్చి ఆగింది. దాంట్లోకి సామానంతా సర్దుతున్నారు. అమ్మ యెందుకో ఏడుస్తోంది. నాన్న నన్నొకసారి ఎత్తుకుని ముద్దాడి క్రిందకుదింపి తను బండి యెక్కాడు. బండి కదిలింది నేను నాన్నకోసరం పెద్ద పెట్టున యేడ్వడం మొదలు పెట్టాను. అమ్మ నన్ను లోపలికి తీసుకెళ్ళి "తప్పు ఏడ్వకూడదు. నాన్న యింకో దేశంవెళ్ళి బోలెడు డబ్బుతెచ్చి నీకు కావలసినన్ని బొమ్మలు అవీ తెస్తారు" అని చెప్పి నా ముందు యిన్ని బిస్కట్లు తెచ్చిపడేసింది. అప్పట్లో ఆమాటలు నాకు సరిగ్గా అర్థం కాలేదు. ఆబిస్కట్లు తింటూ యేడుపు మానేశాను. ఆనాటినుండి యీనాటి వరకు మానాన్న రానేలేదు. ఆతరువాత తెలిసింది నాకు నాన్న వ్యాపారం నిమిత్తం ఒరిస్సా వెళ్ళినట్లు. అప్పడినుండి ప్రారంభమైనాయి మాకు కష్టాలు. కొన్నాళ్ళు నాన్న దగ్గర నుండి ఉత్తరాలు, డబ్బు వస్తుండేవి. క్రమ క్రమంగా ఉత్తరాలు వాటితోపాటు డబ్బు రావడం తగ్గిపోయాయి. కొంత కాలానికి పూర్తిగా రావడం మానేశాయి. మాఅమ్మ ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు లేక కొన్నాళ్ళకి తిరిగి భద్రంగా మా యింటికి జేరేవి. అప్పటికి నేను సెకండ్ ఫారమో థర్డు ఫారమో చదువుతున్నాను. అసలు ఆయన అక్కడ వున్నాడో లేదో కూడ తెలియదు, నన్నెట్లాగైనా పై చదువులు చదివించాలని మాఅమ్మ కోరిక. మానాన్న ఉన్నప్పుడు మేం చాలా ధనవంతులమే. కాని సంపాదన లేకపోయాక ఎంత కాలం గడుస్తుంది. ఎన్నిచోట్లని అప్పులు చేస్తాం. ఎన్నిరోజులైనా ఉత్తరాలు రాకపోవడంతో మాఅమ్మకు చాలా భయమేసింది. అసలు ఆయన బ్రతికి వున్నాడో లేదో అన్న అనుమానంకూడా కలిగింది. ఆమె రోజూ పోస్టుమెనుకు ఎదురు చూడటం ఏమీ లేకపోయేసరికి నిస్పృహతో లోపలికి వెళ్ళిపోవడం పరిపాటయింది. ఆమెకు ఆందోళన యెక్కువయింది. "ఒకవేళ తనను మోసం చేశాడేమో! ఛీ ఏమిటీ ఇటువంటి ఆలోచనలు. అయన ఒక్కనాటికి అట్లా చేయరు. అయనకి నేనంటే చాలా ప్రేమ. నాకోసం యెన్నికష్టాలను యెదుర్కొన్నారు. వాళ్ళ తల్లి దండ్రులతోటి, తనవారందరితోటి పోట్లాడి వారి కిష్టంలేకపోయినా నన్ను చేసికోలేదూ! నాకొరకు వారి తల్లిదండ్రుల నుండి వచ్చే ఆస్థిని సయితం వదలుకోలేదూ! అటువంటి ఆయన నన్ను మోసం చేస్తాడా! ఒక్కనాటికి అట్లా సంభవించదు. ఒకవేళ ఏదైనా ఆపద రాలేదుగదా" అని బాధపడుతుండేది. వెంటనే గబగబా దేవుని పటం ముందుకు పరుగెత్తుకువెళ్ళి "తల్లీ జగజ్జననీ నా మాంగల్యాన్ని కాపాడు తల్లీ. ఆయన కెటువంటి ఆపదారాకుండా చూడుతల్లీ" అని ప్రార్థించి తన మంగళ సూత్రాలను కళ్ళకద్దుకునేది. ఆమెకు రోజు రోజుకూ ఆందోళన ఎక్కువయింది. ఒక ప్రక్క అప్పులవాళ్ళ బాధ యెక్కువయింది. ఆయనగురించి వివరాలు తెలిసికోకుండా వుండలేకపోయింది. నన్ను అప్పుళ్లోనేవున్న మాచుట్టాలింట్లో వుంచేసి తను ఒరిస్సాకు బయలుదేరింది. పాపం ఆమెకు అక్కడ అనుకోని సంఘటన యెదురయింది. ఆమె తన మాంగల్యానికి భయపడింది. తన మాంగల్యానికి యెటువంటి ప్రమాదమూ కలుగలేదు. తన జీవితానికే దెబ్బతగిలింది. అక్కడ మానాన్న యింకెవరినో పెళ్ళిచేసికొని హాయిగా గడుపుతున్నాడుట. మా అమ్మ మానాన్న, నాసవతితల్లి షికారుకువెళ్తుంటే చూసిందిట. కాని ముందు ఎవరో స్నేహితురాలనుకుందిట. ఆమెకు అనుమానంవేసి అక్కడ వాకబుచేయగా నిజంగానే మానాన్న ఆమెను పెళ్ళిచేసికొన్నట్లు చెప్పారుట. ఇంక ఆమెకు అక్కడ వుండటానికి మనస్కరించలేదు. కనీసం మానాన్నకుకూడా తన ముఖం చూపించలేదు. అయినాకాని ఆమె మానాన్నని ద్వేషించలేదు. "పోనీలే ఏదోవిధంగా ఆయన సుఖంగా వున్నారు. నామాంగల్యానికి ఎటువంటి ప్రమాదమూ కలుగలేదు, నాజీవితానికి అదేచాలు" అని తృప్తిపడేది. అటువంటి మంచి హృదయం ఆమెది. తను బాధపడేదికాని వారి సుఖానికి అడ్డు వచ్చేదికాదు. అప్పటినుండి ఆమె తన భర్తతో గడిపిన మధురస్మృతులు జ్ఞప్తికి తెచ్చుకుంటు నామీదనే తన ఆశలు, ఆశయాలు నిలుపుకుని జీవించేది. ఆమెకు మిగిలినవల్లా నేను, గడచిన స్మృతులే.

ఆ వున్న పెద్ద భవంతి కొన్ని విలువ గల వస్తువులు అప్పులవాళ్ళు లాగేసుకున్నారు. అవును మరి ఎవరు మటుకు అప్పు ఎంతకాల మిస్తారు? మాకు అవసరమైన సామానుమటుకు వుంచుకుని మిగిలిన కాస్త సామాను అమ్మేసి ఓచిన్న యిల్లు అద్దెకు తీసుకుని అక్కడకు మకాం మార్చేశాం. ఆ డబ్బు నా చదువుకు గూడా సరిగ్గా చాలదు. ఇంక తిండి సంగతి. మా అమ్మ ఎప్పుడూ బయటకు వెళ్ళి యెరగదు. ఆమె అంత ఎక్కువ చదువుకున్నదికూడా కాదు. ఇంక తప్పని సరిగా ఏదో ఫ్యాక్టరీలో పనిచేసి ఆ కూలి డబ్బులు, యింకా దొడ్లో కూరలూ అవీ పండించి వాటిమీద వచ్చే ఆదాయంతో మెల్లిగా సంసారం యీడ్చుకొచ్చేది. తనేం అవస్థ పడేదో కాని పాపం నాకు మటుకు ఏ లోపం రానిచ్చేది కాదు. రాత్రిళ్లు మేలుకుని నాచేత చదివించేది. పాపం తనెప్పుడూ చిరుగు చీరలు. మాసినవి కట్టేది. నాకు మటుకు మంచి బట్టలు యిచ్చేది. ఈ విధంగా స్కూలు ఫైనల్ పూర్తిచేశాను. "ఇంక నేను చదవను వుద్యోగంలో చేరుతాను" అని పట్టుపట్టాను. కాని మా అమ్మ సుతరామూ యిష్టపడలేదు. "వద్దు బాబూ నీవు కూడా మీ నాన్నకు మల్లే పెద్ద చదువులు చదవాలి. నువ్విప్పుడే వుద్యోగం చేయడానికి వీలు లేదు. అప్పుడే నాకు శాంతి" అని నన్ను కాలేజీలో జేర్పించింది. వచ్చే ఆదాయం చాలేది కాదు. ఆమె రాత్రిళ్ళు రాట్నం వడకడం మొదలు పెట్టింది. ఆమెకు ఒక్క క్షణంకూడా తీరిక ఉండేదికాదు. ఎప్పుడూ ఏదో పని చేస్తుండేది. ఈ విధంగా నేను ఇంటర్ పూర్తిచేశాను. నాకు మార్కులు బాగానే వచ్చేవి. నా మార్కులు విని ఎంత మురిసిపోయిందో

(తరువాయి 23 వ పేజీలో)

## పరాజితుడు

(తరువాయి 26 వ పేజీలో)

నా సవతి తల్లి గదా! ఆమె యిప్పుడు లేదు. కాని అనుకోకుండా ఆమె కొడుకు, నా మిత్రుడు, సోదరుడైన శేఖర్ మీద ద్వేషం కలిగేది. అతనిమీద పగ సాధించాలి అని అనుకునేవాడిని. వెంటనే అతని ప్రేమ, వాత్సల్యం గుర్తుకు వచ్చేవి. ఛీ అంత మంచివాడిమీద పగ సాధించడమేమిటి అని అనిపించేది. నేను రెండు శక్తుల సంఘర్షణ మధ్య నలిగి పోయేవాడిని. ఒక ప్రక్క ఆరని అగ్నిలాంటి పగ మరియొక ప్రక్క అమోఘమైన ప్రేమ. ఈ రెంటి సమరంలో నేను నలిగిపోయాను. ఆ రోజు నుండి నేను మానసికంగా దెబ్బ తిన్నాను. అతని మొహం చూసినప్పుడల్లా నా తల్లి మరణశయ్యమీదున్నట్లు కనిపించేది. ఆమెను డబ్బులేదనే గదా దూరంచేసి కొన్నది. దీనికింతకూ కారణమైన శేఖర్ మీద అతని తల్లిమీద ద్వేషం రగుల్కొనేది. నేను వెంటనే అతని అమాయకపు ముఖంచూస్తే జాలి వేసేది. అతని ప్రేమ నా పగను మర్చిపోయేటట్లు చేసేది. కాని నేను వెంటనే అమ్మ గుర్తుకు వచ్చేది. ఎట్లాగైనా పగసాధించాలి. అట్లాగని పగ సాధించుదామంటే అమ్మో తలచుకుంటేనే భయంగా, బాధగా వుంది. అది మిత్ర ద్రోహం అవదూ? అటు నేను నాస్నేహమైనా వదలుకోవాలి లేదా నా పగనైనా చల్లార్చుకోవాలి. రెండూ కష్టమే. నా పగ ఆరనిది. దేనిని వదలుకోవాలో తెలియు లేదు. నేను మానసికంగా రోజు రోజుకీ క్షీణించిపోయాను. ఏమీ చేయలేకపోయే వాడిని. చాలా మందకొడిగా వుండే వాడిని. యాంత్రికంగా యూనివర్శిటీకి వెళ్తూ వస్తుండేవాడిని. యూనివర్శిటీలో అందరికీ నా ప్రవర్తన ఆశ్చర్యం కలిగించేది. అప్పుడు నేను సాధ్యమైనంత వరకు శేఖరానికి దూరంగా వుండడానికి ప్రయత్నించేవాడిని. నేనెంత దూరంగా వుండాలనుకుంటే అతను అంత దగ్గరకు వచ్చేవాడు. నాకు క్రమేపీ అతని మీద ప్రేమ ద్వేషంగా మారిపోజొచ్చింది. చీటికి మాటికి కసరుకునే వాడిని. అయినా కాని దగ్గరకు వచ్చేవాడు. నేనొకసారి అడిగాను నేనంటే నీకు కోపం లేదా? నిన్ను కసురుకుంటానుకదా "అఁ. అతను నవ్వేరూ" యెంత పిచ్చివాడివి శంకర్ నిజమైన స్నేహంలో అటువంటివి పట్టించుకో గూడదు. నీ సంగతి నాకు తెలియదా? నువ్వేదో బాధపడుతున్నావు? అందుకే అట్లా తయారయ్యావు? అంత మాత్రంచే నిన్ను దూరం చేసికొంటానా?" అని అనేవాడు. నా హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. కరుణతో ద్రవించి పోయింది. ఇంత సహృదయుడిని యెట్లా చంపేది. అతని మొహంలో మూర్తీభవించిన అమాయకపు నిర్మల ప్రేమ నన్ను ముగ్ధుణ్ని చేసేది. ఇట్లా వుండగా నాకొకసారి తీవ్రంగా జ్వరం వచ్చింది. డాక్టరు కూడా ఆశ వదలుకున్నాడు. అప్పుడతను నేను పిసుక్కున్నా రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని నాకు సేవ చేసి నన్ను బ్రతికించుకున్నాడు. హాయిగా అప్పుడు చనిపోయినా బాగుండేది. ఇంత జరిగినా నా బాధ మరీ దుర్భరమైనది. మా అమ్మ ఒంటరిగా వుండి యెన్ని అవమానాల నెదుర్కొన్నది. అవి తలచుకుంటేనే భయంగా వుంది. ఏమైనాసరే పగ సాధించాలి. ప్రేమను చంపుకోవాలి. అప్పుడే నాకు శాంతి కలుగుతుంది, అని అనుకునేవాడిని.

అప్పుడే రైలు ఏదో స్టేషన్‌లోఆగింది. స్టేషన్ గడియారం 3 గంటలు కొట్టింది. "అబ్బా తెల్లవారవచ్చింది. త్వరగా పూర్తి చేస్తాను" అని మళ్ళీ మొదలు పెట్టాడు. ఆ రోజు ఏమైనాసరే చంపాలి అనుకున్నాను. ఆరోజు సాయంత్రం శేఖర్ వచ్చి అల్లా షికారుకు వెళ్దాం అని లాక్కెళ్ళాడు. నేను అటతనంగా వెళ్లాను. నా మనస్సులో ఆలోచనలు రేగాయి. నిజంగా నేను శేఖర్ లేకపోతేబ్రతికేవాడ్ని కాదు. శేఖర్ నాకు ఒకసారి యాక్సిడెంటు అయితే తన రక్తం దానం చేసి నాకు ప్రాణదానం చేశాడు. అదంతా కళ్ళ ముందు మెదిలింది. ఛీ ఏమైనాసరే అతనిని చంపకూడదనుకున్నాను. ఎందుకో మనస్సు తేలిక పడ్డట్లయింది. ఆరోజు హాయిగా నిద్రపోదామనుకున్నాను. కాస్సేపటికి శేఖర్ నిద్రాదేవి వడిలోకి వరిగి పోయాడు. నేను కళ్ళు మూసుకునేప్పటికి గతం జ్ఞప్తికి వచ్చింది. మానసిక సంఘర్షణలో నలిగిపోయి కళ్ళుమూసుకున్నాను. ఏమిటేమిటో ఆలోచనలువచ్చాయి. మా అమ్మ పడ్డబాధలు అన్నీ నాకళ్ళముందు తిరుగుతూ నన్ను పిశాచాల్లాగా వేధించ మొదలు పెట్టాయి. అణచుకొంటున్న ద్వేషం మళ్ళీ రగులుతోంది. మనస్సు కళ్ళెంలేని పందెం గుర్రంలాంటిది. అది నన్ను తప్పుత్రోవ పట్టించింది. "ఇన్ని కష్టాలకు కారణం ఎవరు? అదిగో నీ ప్రక్క పడుకున్నాడే శేఖర్. వాడి తల్లి. లే.... చంపు" అని నామనస్సు తొందర పెట్టింది. భరించలేక అమ్మా అని అరిచాను. ఏమిటలా అరిచావని శేఖర్ అడిగాడు. అబ్బే యేమీలేదు. పీడకలవచ్చింది అని పడుకున్నాను. కాస్సేపటికి శేఖర్ నిద్రపోయాడు. నాకుమటుకు నిద్ర పట్టలేదు, ఆరాత్రి అతనిని హతమార్చాలనుకున్నాను. శేఖర్ హాయిగా నామీద చెయ్యి వేసికొని నిద్రిస్తున్నాడు. మెల్లిగా నేను శేఖర్ చెయ్యి తప్పించి ప్రక్కనున్న కత్తి తీసుకొని అతని వద్దకు వెళ్ళాను. అబ్బ యెంతఅమాయకంగా తనకేమి భయం లేదన్నట్లుగా గుండెలమీద చెయ్యేసుకుని పడుకున్నాడు! అతని మొహం యెంత నిర్మలంగా వుంది. అతనితో గడిపిన రోజులు - అతనిప్రేమ గుర్తుకువచ్చాయి. అతని ప్రశాంతమైన మొహం చూడగానే చేయి వణికింది. మనస్సు కరిగింది. వెంటనే యెత్తిన చెయ్యి క్రిందకు దింపేశాను

నేనిప్పుడు యేంచేయాలి. ఎట్లాగైనా మళ్ళీ నాతల్లి గుర్తుకురాకుండా వుంటుందా? శేఖర్ మొహం చూసినప్పుడల్లా తప్పక గుర్తుకువస్తుంది. తప్పకుండా ప్రేమ, పగ అనే శక్తుల సంఘర్షణమధ్య నలిగిపోవల్సిందే. అందుకు నేను యీపరిస్థితుల నుండి దూరంగా పారిపోవలసిందే. ఇంక

నేను నా మనస్సుతో, పోరాడలేను. అశక్తుల సంఘర్షణకి నేను తట్టుకోలేక పోయాను. నేను అలసి పోయాను ఇంక నాకు ఓపిక లేకపోయింది. ప్రేమ పగయీ రెంటిలో ప్రేమే జయించింది, శేఖర్ ప్రేమే గెలిచింది, గెలుపు అతనిదే, నేను ఓడి పోయాను. నేను పరాజితుణ్ణి, అవును నేను పరాజితుణ్ణి. అందుకే శేఖర్‌కు మళ్ళీ మొహం చూపించలేక పిరికివానివలె పారి పోయి వచ్చాను. శేఖర్ హృదయం నాకు తెలుసు. అతను నన్ను మనసారా క్షమించగలడు। ఆ ఆత్మ విశ్వాసంతోనే పారిపోయివచ్చేశాను బహుశా అతన్ని మళ్ళీ నేను కలుసుకోనేమో. నాకు మిగిలినదల్లా మేమిద్దరం గడిపిన మధుర స్మృతులే.

మధూ ఒక్కటిమాత్రం నిజం. ప్రేమను మించినది యేమీలేదు. అది ఒక మహత్తర శక్తి. ఇప్పుడు తెలుస్తోంది నాకు మా అమ్మ మా నాన్నను మోసం చేసినా యెందుకు ద్వేషించలేదో? ఆమె తన ప్రేమతో ద్వేషాన్ని జయించింది. అందుకే ఆయనంటే అంత అపేక్షగా వుండేది. అల్లాగే శేఖర్‌లోని ప్రేమ నా పగను చల్లార్చింది. ఆ ప్రేమే లేకపోతే యీ పాటికి నేను ఒక అమాయకుణ్ని హత్యచేసి హంతకుడినయ్యేవాడిని. రేపీపాటికి ఉరికంబం మీద నుండే వాడిని. ప్రేమ నన్ను దీనినుండి తప్పించింది. నాలోని పగని చల్లార్చి మనుష్యునిగా మార్చివేసింది. దానవుణ్ని సయితం మానవునిగా చేయగల శక్తి ఒక్క ప్రేమలోనే వున్నది. దానికి అసాధ్యమైనదేమీ లేదు. వైరం విచ్చుకత్తిలాంటిది. అది ఒక్కొక్కసారి మనకే యెదురు తిరుగుతుంది. అటువంటి వైరాన్నికూడా ప్రేమ జయించుతుంది. ప్రేమ అతీతమైనది. అదిచావులేనిది. అది యెంత మధురంగా వుంటుందో అంత తేజోవంతంగాను ప్రకాశిస్తుంది. చంద్రునిలోని చల్లదనం, సూర్యునిలోని తేజం, యీ రెంటి సమ్మేళం, ప్రేమలో వున్నాయి ఇదే నా జీవితంలో తెలుసుకొన్న సత్యం. ఎవరెన్ని చెప్పినా అది యెవరూ కాదనలేని యెదిరించలేని నగ్న సత్యం. అది మూర్ఖ అభిమానంతో కూడిన నా స్వార్థాన్ని, కూడా జయించింది. అది చాలా పవిత్రమైనది.

ఇప్పుడు నాకు జ్ఞానోదయమైనది. మధు నాకిప్పుడు ఏవిచారమూలేదు. కాని ఒక్కటి మాత్రం నిజం. నేను లేకపోతే శేఖర్ చాల బాధపడుతాడు. అంతకు అంతా నేనూ పడతాను. అయినా తప్పదు. నేను రాకుండా అక్కడేవుంటే నాలో చల్లారిన పగ మళ్ళీ రగుల్కొనవచ్చు అందుకే వచ్చేశాను. ఇప్పుడు మళ్ళీ నేను క్రొత్త జీవితంలోకి ప్రవేశించటానికి ప్రయత్నిస్తాను. అని కళ్ళనీళ్ళతో తన కథను శంకర్ ముగించాడు. ఇదంతా విన్న మధు బరువుగా నిట్టూర్చాడు.

"జీవితంలో వెలుగును ప్రసాదిస్తున్నాను. నువ్వేమీ భయపడవద్దు" అని అంటున్నట్లు సూర్యుడు తూర్పునుండి ఎర్రని కాంతుల్ని చిమ్ముతూ పైపైకి ఉదయిస్తున్నాడు.

---

## "అంజలులు"

భరతమాత బానిసత్వ
బంధనములు త్రెంచివేసి
స్వేచ్ఛ, శాంతి, స్వాతంత్ర్యము
'ఆమె' సుతులకందజేసి -

కులమతభేదాలనడుమ
నలిగిపోవు భరతమాత
నొక్కటిగా కలయజేసి
విశ్వశాంతి పథము జూపి -

దేశముకోసము సర్వం
త్యాగము చేసిన ఘనుడవు!
జనుల హృదయ కుహరంలో
"జ్యోతి" యైన మహాత్ముడవు!-

"బాపూ! దశదిశ వ్యాప్త
నీ ప్రశస్తి పొగడతరమ
గురుతర మహిమాన్వితుడవు
చిరునగవుల -" గైకొనుమా—

భారతీయులొక్కటిగా
అర్పించెడి "సుమాంజలులు"
అమర భక్తి భావయుక్త
విమల సహృదయాంజలులు।

రచన:
శ్రీ కె. వి. సత్యనారాయణాచార్యులు


భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటీగా కుదర్చగలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు:

శ్రీ లక్ష్మీ నృసింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.



మీకు ఏవిధమైన సర్జికల్ పరికరములు కావలసినా మమ్మల్ని సంప్రదించండి.

మాది అనుభవజ్ఞులకు, వైద్యులకు సర్జికల్ పరికరములు సప్లయి చేయుటలో పేరెన్నికగన్న సంస్థ.

జాబులు ఇంగ్లీషులోనే.

**P. NATH & CO.,**
2, Jethva Nivas,
Hanuman Cross Road,
VILE PARLE - BOMBAY-26